క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

క్యాలెండర్ ఆవిష్కరణ

తిమ్మాపూర్ రూరల్, జనవరి 9: మన్నెంపల్లి మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్నం అనిల్‌గౌడ్ రూపొందించిన నూతన సంవత్సర–2025 క్యాలెండర్‌ను బుధవారం రాత్రి కరీంనగర్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేసేదాకా పోరాడాలని పొన్నం అనిల్‌గౌడ్‌కు సూచించారు. ఇక్కడ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గొట్టం మహేశ్, శ్రావణ్‌కుమార్, తదితరులు ఉన్నారుఉన్నారు.

రద్దు బదలు చేసిన భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నరు

కొత్తగట్టులో కొత్తగా భూమి కొన్న క్వారీ యజమానితో రైతు దంపతుల వాగ్వాదం

- గ్రానైట్ క్వారీ యజమానితో రైతు దంపతుల వాగ్వాదం

శంకరపట్నం, జనవరి 9: తమ వ్యవసాయ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ కరీంనగర్ జిల్లా కొత్తగట్టుకు చెందిన రైతు మాడ చొక్కారెడ్డి తన భార్యతో కలిసి కొత్తగా భూమి కొన్న క్వారీ యజమానితో గురువారం వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. మాడ చొక్కారెడ్డి మాట్లాడుతూ తమకు కొత్తగట్టు శివారులోని మత్స్యగిరీంద్రస్వామి దేవస్థానం గుట్టకు ఎదురుగా 165 సర్వే నంబర్‌లో 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. 17 ఏళ్ల క్రితం తన తండ్రి మాడ కిషన్‌రెడ్డి, శివకుమార్ అనే గ్రానైట్ క్వారీ యజమానికి దారి కొరకు 14 గుంటల భూమి ఇచ్చాడు. రద్దు బదలు కింద సర్వే నంబర్ 168లో ఎకరం 30 గుంటల భూమిని శివకుమార్ తమకు ఇచ్చి నోటరీ రాసి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం మరో వ్యక్తి క్వారీని నిర్వహిస్తున్నాడని, తమకు రద్దు బదలు కింద ఇచ్చిన భూమి అతనిదేనని రిజిస్ట్రేషన్ పత్రాలు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రద్దు బదలు కింద ఇచ్చిన భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం అక్రమం కాదా..? అని నిలదీశారు. ఈ క్రమంలో క్వారీ యజమాని దరఖాస్తుతో సర్వేయర్ రాజేంద్రప్రసాద్ గురువారం వీఆర్వైతో కలిసి సర్వేకు రాగా, చొక్కారెడ్డి దంపతులు క్వారీ యజమానులు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సర్వేను మధ్యలోనే నిలిపి వేశారు. కాగా గత 17 ఏండ్లుగా ఆ భూమిలో తామే కబ్జాలో ఉన్నామనీ, తమకు న్యాయం జరిగే దాకా పోరాడతామని రైతు దంపతులు పేర్కొన్నారు.

యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 9 : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకువచ్చిన మార్గ దర్శకలను రద్దు చేయాలని గురువారం శాతావాహన యూనివర్శిటీ మెయిన్ గేట్ ఎదుట భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకువస్తున్న మార్గదర్శకాలను రద్దు చేయాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని దీన్ని వెనక్కి తీసుకోకపోతే పార్లమెంట్ భవన్‌నీ ముట్టడిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇక్కడ నాయకులు చిట్యాల రాజ్‌కుమార్, దాడి మహేశ్, గణేశ్, ఉదయ్, భాను, మల్లేశ్, దీక్షిత్, శివ, చందు, రాజు, ప్రవీణ్, జగన్, నవీన్, భీమ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల గొంతు కోసిన ప్రభుత్వం

కలెక్టరేట్, జనవరి 9 : ఎన్నికల్లో దివ్యాంగుల ఓట్ల కోసం ప్రాధేయపడ్డ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమ గొంతు కోసిందని, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మా గంటి మనోహర్ ఆరోపించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి వేరుచేస్తామని ఇచ్చిన హామీ ఏడాది గడిచినా, అమలు చేయలేదని విమర్శించారు. గురువారం నగరంలోని కాపువాడలోని ఆ సంఘం జిల్లాశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇచ్చిన మాట మరిచిన సీఎం రేవంత్ దివ్యాంగులకు తీరని అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరువేల పెన్షన్ పెంపు అటకెక్కిందని, ఉపకరణాల పంపిణీ ఉత్తదే అన్నట్లుగా మారిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే వరుస ఆందోళనలు చేపట్టి, ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దివ్యాంగ నాయకులు పెద్దెల్లి వెంకటేశం, ఒద్దిరాల వినోద్‌రావు, రఘునాయకుల గోపాల్‌రెడ్డి, బింగి రాంమోహన్, మధుసూదన్, శ్రీలక్ష్మి, తారాబాయి, ఎం రాములు, ముడికె మల్లయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ బిల్లులు ఎప్పడిస్తరు ?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వక పోవడం దుర్మార్గం
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి సంజయ్ బహిరంగ లేఖ

విద్యానగర్, జనవరి 9: రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడాన్ని తప్పుబడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. విద్య, వైద్యం విషయంలో కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తున్న తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓ వైపు 'ఆరోగ్యశ్రీ' పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు, సేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం, అసలు బిల్లులే చెల్లించకుండా, సేవలను నిరుపేద ప్రజలకు అందకుండా చేస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా ఆరోగ్య శ్రీ బకాయిలు పేరుకుపోయాయని, ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. విదేశీ పర్యటనలు, ఢిల్లీ పర్యటనలు, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న మీకు రూ.8 వేల కోట్లు చెల్లించేందుకు మనసు రావడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి బిల్లులు, బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థుల విరాళం

హుజూరాబాద్ టౌన్, జనవరి 9 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా ల 1986–88 బ్యాచ్‌కు చెందిన ఎంపీసీ బైపీసీ పూర్వ విద్యార్థులు ' మైత్రి వెల్ఫేర్ అసోసియేషన్' సంస్థ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మినర ల్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు రూ. 25 వేల చెక్కును అందించి తమ దాతృ త్వాన్ని చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వీ ఆంజనేయరావుకు పూర్వవి ద్యార్థులు గురువారం కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మైత్రి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, కార్యదర్శి గుంటి రవీందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కొర్ని సమ్మిరెడ్డి, ఫక్రుద్దీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోస్కుల శ్రీనివాస్, కేసరి మధుకర్ రావు, చొల్లేటి గంగాధర్, దేవత రవి, విజయ నిర్మల, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వేల్పుల రత్నం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మానకొండూర్ రూరల్, జనవరి 9 : ఆగి ఉన్న లారీని ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టి, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదుల గట్టెపల్లి పెట్రోల్ పంపు సమీపంలో వరంగల్–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఓ లారీ కరీంనగర్ వైపుగా వెళ్తుండగా, లారీ టైర్ బ్లాస్ట్ కావడంతో రోడ్డుపై నిలిపి ఉంచాడు. కాగా, మానకొండూర్ మండలం పెద్దూర్‌పల్లి గ్రామానికి చెందిన గంగినేని అజేయ్ (22) గురువారం ఉదయం కరీంనగర్‌కు ఓ పని నిమిత్తం వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై నిలిచి ఉన్న లారీని గమనించక ఢీకొట్టాడు. దీంతో అజేయ్‌కి తీవ్ర గాయాలు కాగా, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సంపత్ ఇటీవల విదేశాలకు వెళ్లాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



అజేయ్ (ఫైల్)

వసతి గృహాల్లో శుభ్రత, నాణ్యత పాటించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

విద్యార్థులతో మాట్లాడుతున్న మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 9 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో శుభ్రత పాటించాలని, నాణ్యమైన సరుకులు వినియోగించాలని కలెక్టర్ పమేలా సత్పతి వసతి గృహ సంక్షేమ ఆధికారులను ఆదేశించారు. ఎవరైనా నిబంధనల ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్టల్ నిర్వహణపై వసతి గృహాల ప్రత్యేకాధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లతో గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సరుకుల సరఫరాదారు నుంచి ఏరోజుకు కావాల్సిన సరుకులు ఆరోజే తీసుకోవాలని సూచించారు. నిల్వ ఉండేలా ఎక్కువ సరుకులు సరఫరా చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. వంట పాత్రలను, వంట గదిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. కొత్త మెనూ అమలు కోసం ఇంకా వంట సామగ్రి అవసరమైతే అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర అజయ్‌యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రపంచ వేదికపై ప్రసంగించాలి

గన్నేరువరం, జనవరి 9 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రపంచ వేదికపై తమ ఉపన్యాసాలివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. మండలంలోని జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెడ్ ఎడ్ స్టూడెంట్స్ టాక్స్ క్లబ్‌ను విద్యార్థుల అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో టెడ్ ఎడ్ కోచింగ్ కోసం గుర్తింపు పొందిన ఏకైక ప్రభుత్వ పాఠశాల జంగపల్లి ప్రభుత్వ పాఠశాల అని తెలిపారు. ఈ గుర్తింపు వెనుక ఎంతోమంది ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. వంటగదిని, వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, మండల విద్యాధికారి రామయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, కే శారద పాల్గొన్నారు.

విద్యార్థులకు జామెట్రికల్ బాక్కుల పంపిణీ

చొప్పదండి, జనవరి 9 : మండలంలోని చాకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సామిజక సేవకురాలు, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి శకుంతల విద్యార్థులకు జామెట్రికల్ బాక్సుతో పాటు పెన్నులను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుకునేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలికోట తిరుమల్‌తో పాటు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు అరకాల శ్రీనివాస్ ఈ విద్యా సంవత్సరంలో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల సంఖ్యను పెంచడం జరిగింది. అధ్యాపక బృందం కృషిని గుర్తించిన సామాజిక సేవకులు శకుంతల, నర్సయ్య అభినందిస్తూ, పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ చిన్న చిన్న బహుమతులు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, అనీస్ ఫాతిమా, వనిత ఉన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలతో ముడిపడ్డాయి

- ఒలింపియాడ్ నిర్వహణలో డీఈవో తీరు గర్హణీయం
- మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శంకరపట్నంలో ప్రెస్‌మీట్

మాట్లాడుతున్న మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

శంకరపట్నం, జనవరి 9 : గతానికి భిన్నంగా నేడు ఉపాధ్యాయ, విద్యావంతుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలతో ముడిపడ్డాయని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. గడిచిన కొంత కాలంగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎందరో పేరొందిన నాయకులు సైతం రాజకీయ పార్టీల నీడలోనే ఎదిగారని ఉదహరించారు. ఇటీవల 'రాజకీయాల్లో సేవే పరమావధి'.. అన్న ధోరణి మారిందని, నాయకుల్లో విలువలు లోపించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే వైట్ కాలర్ నాయకులుగా చలామణి అవడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. తాను సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉంటూ ఎన్నో ప్రజోపకరమైన పనులు చేసి, ప్రజల అభిమానాన్ని చూరగొన్నానని సంతృప్తి వ్యక్తం వేశారు. అదే నేడు తనను ప్రజల్లోకి వెళ్లేలా చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రోజు రోజుకూ రాజకీయ సమీకరణాలు మారుతుంటాయన్నారు. తాను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శంకరపట్నంలో పర్యటించినట్లు వెల్లడించారు. అన్ని చోట్లా తనకు ప్రజల నుంచి సానుకూల స్పందన లభించినట్లు తెలిపారు.

డీఈవో తీరుపై ఆగ్రహం

ఒలింపియాడ్ నిర్వహణలో డీఈవో తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒలింపియాడ్ నిర్వహణలో ప్రభుత్వ పాఠశాలతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులను విస్మరించి, ఒక ప్రైవేట్ పాఠశాలకు పెద్దపీట వేయడం, ప్రభుత్వ ఉపాధ్యాయులను కించపరిచినట్లు కాదా అని ప్రశ్నించారు. ఎందరో మేధావులు, నాయకులు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వాళ్లేనన్న విషయాన్ని మరువద్దన్నారు. దీనిపై తాను ఇప్పటికే ఫిర్యాదు సైతం చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గంట మహిపాల్, ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ చౌడమల్ల వీరస్వామి, న్యాయవాది తేజ్‌దీప్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

తెలంగాణచౌక్, జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని శాతావాహన విశ్వవిద్యాలయ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌భవనంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌లో విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యార్థుల సమస్యలను పరిష్కారిస్తామని వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చి తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి నియమించకుండా సీఎం రేవంత్ రెడ్డి నియంత పాలన కొనసాగిస్తుదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ పాయిజన్‌తో 52 మంది విద్యార్థులు మరణించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అధికార దాహం తప్ప పేద విద్యార్థుల జీవితాలపై పట్టింపు లేదన్నారు. విద్యార్థుల జీవితాల్లో చెలగాటం అడుతున్న కాంగ్రెస్ ను గద్దె దింపె దిశగా పని చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించని పక్షంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మంత్రులను అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ విదార్థినాయకులు అశోక్, ఆరుణ్ తేజ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ కారుకులపై చర్యలు తీసుకోవాలి

ఫుడ్ పాయిజన్‌కు కారకులైన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు.



విచారణ జరుపుతున్న అధికారులు

తిమ్మాపూర్ , జనవరి 9 : మండలంలోని ఎల్ఎండీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై గురువారం డీడీవో నాగలేశ్వర్, అసిస్టెంట్ ఆఫీసర్ విజయపాల్ రెడ్డి, డీటీవో లక్ష్మణ్, ఎంపీడీవో విజయ్ కుమార్ హాస్టల్‌ను సందర్శించి, విచారణ చేపట్టారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోగా, నిలకడగా ఉందని తెలిపారు.

రేణికుంట గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్

తిమ్మాపూర్ రూరల్, జనవరి 9 : ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేణికుంట గ్రామాన్ని కలెక్టర్ పమేలా సత్పతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిలో భాగంగా 28 మందికి పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్ ఉన్న వారికి మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

శిశుగృహ నుంచి శిశువు దత్తత

కలెక్టరేట్, జనవరి 9 : నగరంలోని శిశుగృహాలో పెరుగుతున్న నాలుగు నెలల మగ శిశువును పిల్లలు లేని దంపతులకు మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారులు దత్తత ఇచ్చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కలెక్టర్ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లాకేంద్రంలోని భగత్‌నగర్‌లో గల జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శిశువును దత్తత తీసుకున్న సిద్ధిపేటకు చెందిన దంపతులు, జిల్లా సంక్షేమాధికారి సబిత, డీసీపీవో పర్వీన్, పివో తిరుపతి పాల్గొన్నారు.

16 నుంచి పరీక్షలు

కమాన్‌చౌరస్తా, జనవరి 9 : శాతావాహన యూనివర్శిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షలు జనవరి 16 నుంచి ప్రారంభమవు తాయని పరీక్షల నియంత్రణ అధికారి శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు జనవరి 21 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

సౌత్ ఇండియా యూనివర్సిటీ చదరంగం పోటీలకు జీనిఎస్ చెస్ అకాడమీ క్రీడాకారులు

కొత్తపల్లి, జనవరి 9 : చెన్నైలో శుక్రవారం నుంచి జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ చదరంగం పోటీలకు కరీంనగర్‌లోని జీనిఎస్ చెస్ అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్టు చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి కనకయ్య, కోచ్ కంకటి అనూప్ కుమారులు తెలిపారు. ఇటీవల జరిగిన శాతావాహన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో రాణించిన శ్రీనిజ, స్వాతి, నితిన్, అరుణ్, జేఎన్టీయూ నుంచి వరుణ్ ఎంపికయ్యారు. గురువారం అకాడమీలో జరిగిన కార్యక్రమంలో సౌత్ ఇండియా యూనివర్శిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించి పోటీల్లో పతకాలు సాధించాలన్నారు. క్రీడాకారుల ఎంపికపై కోచ్‌లు సృజన్, అనూష్, అభిరామ్, రేవిక్, తల్లిదండ్రులు అభినందించారు.

కానిస్టేబుల్‌కు బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు



ప్రశంసా పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ నరేశ్

తిమ్మాపూర్, జనవరి 9 : ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్ నరేశ్ 2024 సంవత్సరానికి గాను బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును అందుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ అభిషేక్ మహంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వివేక్‌తో పాటు సిబ్బంది ఆయనను అభినందించారు.

జీజీహెచ్ కరీంనగర్‌ను సందర్శించిన ఎన్ఎంసీ సభ్యులు

విద్యానగర్, జనవరి 9 : నేషనల్ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ వినయ్ గురువారం సందర్శించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రస్తుతం రెండు డీఎన్‌బీ పోస్టులు ఉండగా మరో అదనంగా అవసరం కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. వారి వెంట దవాఖానా సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనలు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, జనవరి 9 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించే 68వ జాతీయస్థాయి ఎస్జీఎఫ్ అండర్–17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. జమ్మికుంట మండలంలోని కొరపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న జిట్టవేని శ్రీను, ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ జడ్పీహెచ్ఎస్ చెందిన పీడీ జెట్టిపల్లి అశోక్, రామడుగుకు చెందిన హ్యాండ్‌బాల్ కోచ్ కలిగేటి శ్రీనివాస్ ఎంపికయ్యారని తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డడి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని ఎంపికపై పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాశాఖాధికారులు అభినందించారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

శంకరపట్నం, జనవరి 9 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 6–10 తరగతి వరకు ఏర్పడే ఖాళీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 13న నిర్వహించే ఉమ్మడి పరీక్షలో మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7–10 వరకు ఏర్పడే ఖాళీలను బట్టి ఎంపిక ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 9: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ కళా మండలి రాష్ట్ర కో–ఆర్డినేటర్ భరత్ డిమాండ్ చేశారు.నగరంలోని కోర్టు చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాకారుల రథయాత్రలో అయన మాట్లాడుతూ అంబేద్కర్ అలోచన విధానంతో ఫిబ్రవరి 7 న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో మాదిగలు,ప్రజాసంఘులు పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రుద్రపు రామచంద్రం,ప్రభాకర్,ప్రజాసంఘాల నాయకులు సముద్రాల అజయ్,ఆనందరావు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

గంగాధర, జనవరి 9 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి డబ్బు, నగలు ఎత్తుకెళ్లిన సంఘటన గురువారం మండలంలో జరిగిది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బూరుగుపల్లికి చెందిన చింతలకోట మల్లేశం, లక్ష్మి దంపతులు మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నారు. రోజు మారిదిగానే ఇద్దరు పాఠశాలకు వెళ్లారు. వారి కొడుకు గణేశ్ శబరి అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లగా, కోడలు అర్పిత ఇంటికి తాళం వేసి, ఊరిలోనే ఉన్న తల్లిగారింటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాగా, తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి చుడగా ఇంటిలో ఉన్న బీరువాను పగులగొట్టి అర తులం బంగారం, రూ. 10 వేలు చోరీ చేసినట్లు తెలిపారు. గంగాధర పోలీసులకు సమాచార ఇచ్చినట్లు తెలిపారు. ఎస్ఐ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా, దొంగతనం జరిగిన విషయం నిజమేనని, బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ప్రారంభిస్తున్న జీవీ రామకృష్ణారావు

వైకుంఠరథం వితరణ

మానకొండూర్ రూరల్, జనవరి 9 : మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన యేల్పుగొండ లింగయ్య తల్లిదండ్రులు యేల్పుగొండ గట్టయ్య–లస్మమ్మతో పాటు సహోదరు డు యేల్పుగొండ రాజయ్య ఇటీవల మృతి చెందారు. కాగా, వారి జ్ఞాపకార్థం గురువారం గ్రామానికి రూ. 3 లక్షల 35 వేల విలువైన వైకుంఠరథాన్ని గ్రామ ప్రజలకు వితరణ చేసి, రథం తాళం చెవిని గ్రామ కార్యదర్శి పద్మలతకు అందజేశారు. ఈ వైకుంఠ రథాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ప్రారంభించి, లింగయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ తాజా సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, గ్రామస్తులు బత్తిని సాగర్, కాసం బ్రహ్మారెడ్డి, బాలెంకి మల్లేశం, కొత్తపల్లి వెంకటస్వామి, నందగిరి మల్లయ్యచారి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంతోష్, ఏగోలపు శ్రీనివాస్, నాగపూరి మల్లేశం, బొల్లబత్తిని రవి, దాడి కొమురయ్య, కాసం కిష్టారెడ్డి ఉన్నారు.

ఐదు గంటలు కరెంట్ కట్

గంగాధర, జనవరి 9 : మండల కేంద్రంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందు పడ్డారు. కరీంనగర్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 5 గంటల పాటు కరెంట్ లేకపోవడంతో పనులు చేసుకోవడంలో ఇబ్బంది పడినట్లు ప్రజలు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కరెంటు సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గన్నేరువరం, జనవరి 9 : మంచిర్యాల జిల్లా సోమగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో మండలంలోని గుండ్లపల్లిలోని ఎస్ఏ ల్ఎన్ స్పార్కిల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన శివ, ఆదిత్య, శశి, ధనుష్, శివాని బంగారు పతకాలు సాధించగా, భావజ్ఞ వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనే యులు కరాటే మాస్టర్ శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులను గురువారం పాఠశాల లో అభినందించారు. కరాటే పోటీల్లో విద్యార్థులు రాణించి, పాఠశాలకు గుర్తింపును తీసుకురావడం హర్షనీయమన్నారు. కరస్పాంటెండెంట్ సంపత్, అకాడమిక్ డైరెక్టర్ సతీష్ పాల్గొన్నారు.

'పిల్లలకి సమతుల్య ఆహారం'పై శిక్షణ

కమాన్‌చౌరస్తా, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలోని పార మిత లిటిల్ జీనియస్ పాఠశాల (పీఎల్‌జీ)లో మూడు రోజులుగా పోషణ, దాని ప్రాముఖ్యతపై దేవేందర్ శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరంలో పిల్లలకు ఆరో గ్యకరమైన ఆహారపు అలవాట్లు, దాని ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడంలో ఆచరణాత్మక చిట్కాలను అందించడంపై దృష్టి పెట్టామని ప్రధానోపాధ్యాయురాలు కవిత తెలిపారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్ రావు మాట్లాడుతూ, విద్యలో సమతుల్యమైన ఆ హారం అనేది ఒక భాగమని, పిల్లల ఆహారపు అలవాట్లు వారి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందని తెలిపారు.

ఆర్ఐపై చర్యలకు ఆర్డీవోకు వినతి

చిగురుమామిడి, జనవరి 9 : మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ముదిమాణిక్యం గ్రామానికి చెందిన రైతు జక్కుల రాములు గురువారం ఫిర్యాదు చేశారు. తన వ్యవసాయ బోరు బావి మోటర్ కరెంట్ సాంక్షన్ కోసం షిఫాం మీద సంతకం చేయాలని కోరగా, ఆర్ఐ ఇష్టం వచ్చినట్లుగా బూతులు మాట్లాడాడని, ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకోపో.. అని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆత్మభిమానం దెబ్బతినేలా బూతులు తిడుతూ వ్యవహరించిన ఆర్ఐ సంతోష్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని, బోరుబావి మోటర్ కరెంట్ సాంక్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు రాములు ఆర్డీవోను కోరారు. ఆర్ఐ సంతోష్ గతంలో మండలంలోని ప్రజాప్రతినిధులు కార్యాలయానికి ప్రజా సమస్యలపై వచ్చినప్పటికీ వ్యక్తులపై అనుచితంగా ప్రవర్తించాడని ఆర్డీవోకు వివరించినట్లు రాములు తెలిపారు. కాగా, పై విషయాన్ని ఆర్ఐ సంతోష్‌ను వివరణ కోరగా, తాను రాములుపై అసభ్యంగా ప్రవర్తించలేదని, తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ఆధారాలుంటే శాఖా పరమైన చర్యలకు తాను సిద్ధమని ఆర్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 9 : మండలం లోని తాడికల్ శివారులో ఆర్టీసీ బస్సును ఓ లారీ వెనుకాల నుంచి ఢీకొన్న ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా, రామగుండం నుంచి ఖమ్మం వెళ్తున్న ఓ లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లో కూర్చున్న కరీంనగర్‌కు చెందిన క్రిష్ణవేణి, జ్యోతి గాయపడ్డారు. 108లో దవాఖానకు తరలించారు.